

# అభినంద

—చంద్ర

అయిదున్నరకి అలారం అలవాటుగా మేలు కొలుపులు పాడకపోయినా చందనకి మెలుకువ వచ్చేసింది. దగ్గరపడుతోన్న ఫైనల్ ఎగ్జామ్స్ గుర్తుకురాగానే రాత్రంతా బబ్లూగాడి అల్లరి మిగిల్చిన అలసట ఆవిరయిపోయింది. పిల్లలు లేచేలోగా ఓ పాఠం పూర్తిచేద్దామని వస్తోన్న ఆవులింతల్ని ఆపుకుంటూ, మొహం కడుక్కొని పుస్తకం ముందేసుకొంది. మానేసిన చదువు మళ్ళీ మొదలు పెట్టడం– సబ్జెక్ట్ చందనకి ఇష్టమైనదే అయినా సులభంగా కొరుకుడు పడడంలేదు. పిల్లల హడావుడిలోపడి ఏనాడూ కాంటాక్ట్ క్లాసెస్‌కి వెళ్ళలేదు. రెండు సంవత్సరాలు ఎలాగో పూర్తయ్యాయి. ఇక ఈ సంవత్సరమే!

ఆలస్యంగానైనా అలారం హడావుడిగా అరవడం మొదలుపెట్టింది. చదువుమీద దృష్టి మోపిందో లేదో ఈ అరుపులకి పుస్తకం మూసి, ముందు దాని నోరు నొక్కేసింది. ఈ శబ్దానికి బబ్లూగాడు కానీ కదిలాడేమోనని చూసి, పింకీకి దుప్పటి సరిచేసి వరండాలోకి పుస్తకం పట్టుకొని వెళ్ళింది. రాత్రి కోయకుండా వదిలేసిన సన్న జాజుల పరిమళం కానీ, ఉదయభానుని లేత కిరణాలు నాట్యమాడుతున్న మంచుముత్యాలు కానీ చందనను ఆకర్షించలేదు. అలవాటు తప్పిన చదువు. నిద్రలేని కళ్ళు విశ్రాంతి కోరుకుంటున్నా, కూడదీసుకొని చదువుకొంటోంది.

"అమ్మా" రత్తాలు అరచిన అరుపుతో లోకంలో పడింది. "తొరగా అంట్లు వేసీయండమ్మా వాకిలి చిమ్మేసుకొస్తాను. ముగ్గు మీరేస్తారా? నన్నేసీయ మంటారా?"

"అబ్బా! పొద్దుటే ఏవిటే నీగోల? ఏదో ఒకటి చేయి. అంట్లువేస్తాలే కానీ నన్ను కాసేపు చదువుకోనీ," అంది చందన. దానికి వాగుడు మొదలు పెట్టడమే కానీ ఆపడం తెలీదు. దాని వాగుడు భరించడంకన్నా అంట్లు వేయడమే సులభమని పుస్తకం పక్కన పడేసి వంటింట్లోకి దూరింది. అంట్లు సర్దివేసేసరికి పాలవాడి కేకలు. రత్తాలుకి పాలగిన్నెకడిగి, పాలుపోయించుకోమని పురమాయించి, చందన బబ్లూగాడి పాలసీసా పట్టుకొచ్చింది, శుభ్రంచేసి వుడకబెట్టడానికి. పాలుకాచి వాడి కోసం కొంచెం చల్లార్చే ప్రయత్నంలో పడింది.

"గుడ్ మాణింగ్ మమ్మీ" ఆరేళ్ళ పింకీ కాన్వెంటు మానెర్స్.

"గుడ్ మాణింగ్, తమ్ముడు లేచాడా?" లేవకుండా వుంటే బావుండునని కోరుకుంటూ అడిగింది.

"అహ" పింకీ తల అడ్డంగా వూపి," బట్ మమ్మీ పప్పా లేచాడు. కాఫీ అంట." అంది.

ముందు పింకీకి బ్రష్ మీద పేస్ట్ వేసిచ్చి, కాఫీ కలుపుకొని బెడ్‌రూంలోకి వెళ్ళింది చందన. ముసుగుతన్ని, గురకలు పెడుతోన్న సురేష్‌ని చూసి కాఫీ కలవరింతలు నిద్రలోనేమోలేనని వెనుతిరిగిన చందనని, "చందూ, కాఫీ" సురేష్

కళ్ళు తెరవకుండానే పిలిచాడు.

కళ్ళు మూసుకుని కాఫీ మాధుర్యం చవి చూస్తోన్న సురేష్‌ని కొత్తగా చూస్తున్నట్లు, కన్నార్పకుండా చూస్తూ తన కాఫీ పని కూడా కానిచ్చింది చందన.

"దిస్ ఈజ్ ద వే వి బ్రష్ అవర్ టీత్, ఎర్లీ ఇన్ ద మార్నింగ్" పింకీ పాట పాడుతూ బ్రష్ చేసుకొంటోంది.

పింకీకి పాలు కలిపిచ్చి, గబగబ ఇడ్లీ పిండి కుక్కర్‌లో పెట్టి, డ్రాయింగ్ రూంలో పడేసిన పుస్తకం వెతుక్కుని ముచ్చటగా మూడోసారి చదవడం మొదలుపెట్టింది చందన.

మొదటి పేరా అయ్యిందో లేదో "కయ్"మంటూ బబ్లూ కేక, "చందూ, కొంచెం వీడి సంగతి చూడకూడదూ?" ఆ వెనకే సురేష్ అరుపు.

బబ్లూ తడిసిన బట్టలు మార్చేసి, పాలసీసా నోట్లోపెట్టి, జోకొడుతూ కూర్చుంది చందన. తండ్రీ కొడుకులు ఇద్దరూ శాంతించారు.

"మమ్మీ నువ్వెపుడూ వాడి దగ్గరే కూచుంటావే? నాకు రిక్షా వచ్చేస్తుంది. క్విక్ మమ్మీ ఐ వాంట్ టు టేక్ బాత్," నడుం మీద చేతులు పెట్టుకొని, గుమ్మంలో నిల్చుని పింకీ పిలుస్తోంది.

పింకీ స్నానం పనీ, జడలు అనబడే పిలకల పనీ అయ్యేసరికి, తీరిగ్గా అవులిస్తూ సురేష్ వచ్చాడు, "బాగా చదువుకొన్నావా, చందూ" అంటూ.

"మాణింగ్ పప్పా. మమ్మీ సీరియస్‌గా చదువుతోంది. నేను చూసా," న్యూటన్ ఫోజుపెట్టి పింకీ రిపోర్టు.

ఉక్రోషంతో పింకీ నెత్తిన మొట్టికాయ వేసి, చేతిలో ఇడ్లీప్లేటు పెట్టింది చందన.

అదేదో పెద్దజోక్ అయినట్లు పప్పా పాపలు ముసిముసి నవ్వులు నవ్వుకొంటూ ఒకర్నొకరు చూసుకుంటున్నారు. చందన ఉరిమినట్లు చూసేసరికి పింకీ రిక్షాలోకి, సురేష్ పేపర్‌లోకి దూరేసారు.

ఇంట్లో నేనూ వున్నాన్నట్లు బబ్లూ మరోసారి రాగం తీసాడు. బబ్లూని వుయ్యాల్లోంచి తీసి సురేష్ వళ్ళో కూర్చోబెట్టి, వాళ్ళిద్దరి స్నానం ఏర్పాటులో పడింది. సురేష్ టిఫిన్ అయి హాస్పిటల్‌కి వెళ్ళేసరికి పదిన్నర.

బబ్లూని బేబీవాకర్‌లో కూర్చోబెట్టి, బొమ్మలిచ్చి, వంట ప్రయత్నంలో పడింది. మధ్య మధ్యలో బబ్లూ కయ్‌మంటూ నేపథ్య సంగీతం అందిస్తుండగా వంట అయిందనిపించి, స్నానం చేసేసరికి పన్నెండున్నర అయ్యింది. పింకీ క్యారియర్‌కి రత్తాలు వచ్చేసింది.

బబ్లూకి సిరిలాక్ తినిపించి, వాణ్ణి నిద్ర పుచ్చుతూ చదువుకొందామని పుస్తకం తీసుకొని బెడ్ చేరిన చందనకి బబ్లూకన్నా ముందే కునుకు పట్టేసింది.

కాసేపట్లోనే కాలింగ్ బెల్ ఆగకుండా మోగడంతో మెలుకువ వచ్చి, కళ్ళు నులుముకుంటూ తలుపు తీయడానికి వెళ్ళింది చందన.


సురేష్ ఒకడే కాదు వచ్చింది. చందన వాళ్ళ ఆడపడుచు వాళ్ళాయన కూడా వెంట వున్నాడు. బావామరుదుల పరాచికాలతో భోజనం అయి వంటిల్లు సర్దుకునేసరికి మూడున్నర అయ్యింది.

పింకీ రావడం దాని అరుపులకి బబ్లూ లేవడం ఒకేసారి జరిగాయి, అటూ ఇటుగా.

ఇంతలో "అమ్మా నాకు టి.వి.లో సినిమా టైమయిపోతోంది. ముందు నా పని చూడండి", అంటూ రత్తాలు ప్రత్యక్షం అవనే అయింది.

ఇక ఆ సాయంత్రం పుస్తకం జోలికి కూడా వెళ్ళే అవకాశం పాపం చందనకి లేదు.

మళ్ళీ సాయంత్రం టిఫిన్లు, కాఫీలు, సురేష్‌ని, ఆడపడుచు వాళ్ళాయన్ని సాగనంపడాలు, పిల్లల స్నానాలు అయ్యేసరికి ఏడు దాటింది.



### పాదాలు

శరీరంలో 'కళ్ళు' ఎంత ముఖ్యమో 'కాళ్లు' కూడా అంత ముఖ్యం. అయితే కాళ్ళ గురించి అంతగా ఎవరూ పట్టించుకోరు. కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమాలుకుంటే కాని పట్టించుకోరేమో. పాదాలు, కాలి వేళ్లు తమ అందం కోల్పోడానికి ముఖ్య కారణాలు, సరిపోని జోళ్లు వేసుకోవడం, తెగ ఇబ్బంది పెట్టే జోళ్లు తొడుక్కోవడం, అనవసరపు ఒత్తిడి పాదాలకి కలిగించడం. చిన్నప్పుడు బుల్లి పాపాయిగా ఉన్నప్పుడు పాదాలు ఎంత ముద్దు వస్తూ ఉంటాయో, పెద్దయ్యాక కూడా అంత ముద్దు వచ్చేటట్లు వాటిని ఉంచుకోవటం ఏ మాత్రమూ కష్టం కాదు.

పింకీకి హెూంవర్కులో సాయం చేస్తూ, బబ్లూని పలకరిస్తూ సాయంత్రపు వంట పూర్తి చేసింది చందన.

బబ్లూ సిరిలాక్, పింకీ భోజనం అయ్యాక, బబ్లూని ఆడించుకోవడానికి పింకీని బతిమిలాడి, ఒప్పించి ఇద్దరికీ బొమ్మలిచ్చి డ్రాయింగ్ రూంలో కూచోపెట్టింది.

బెడ్‌రూంలో తలుపులు వేసుకొని పుస్తకంలో సగంలో ఆపిన దగ్గర నుంచి చదవడం మొదలు పెట్టింది చందన.

చందన చదువుతోన్న పుస్తకంలో పేజీ తిప్పక ముందే, బయట ఏదో దబ్బున పడిన శబ్దం, బబ్లూగాడికేక, ఏడుపు, పింకీ తలుపు మీద బాదడం ఒకేసారి జరిగాయి.

చందన ఒక్క ఉదుటున లేచి డ్రాయింగ్ రూంలోకి పరుగెత్తింది. బబ్లూ తెల్ల జుబ్బా మీద రక్తం. పింకీ బిత్తరపోయి గోడనానుకొని నిల్చుని వుంది. మెడికల్ కిట్ తీసుకొచ్చి బబ్లూ నుదుటికి ఫస్ట్ ఎయిడ్ చేసి, బ్యాండేజి కట్టింది చందన.

భయపడ్డారేమో వెక్కి వెక్కి ఏడుస్తున్నారు ఇద్దరూ. ఇద్దర్నీ సముదాయించి నిద్రపుచ్చేసరికి, సురేష్ వచ్చాడు మరో అలసిన సాయంత్రం తరువాత.

బబ్లూగాయం సురేష్‌కి చూపించి ఫర్వాలేదన్నాక చందన కాస్త కుదుటపడింది.

సురేష్ స్నానం చేసి వచ్చేలోగా భోజనం వడ్డిం చేసింది.

"నేనీ పరీక్షలు వ్రాయడం మానేద్దామనిపిస్తోంది," భోంచేస్తూ ఎలాంటి ఉపోద్ఘాతం లేకుండా అంది చందన.

సురేష్ ఏం మాట్లాడలేదు.

"అటు ఇంట్లో పని మీదా మనసు కుదరకా... ఇటు చదువుమీదా శ్రద్ధ నిలుపలేక.... మిమ్మల్నందర్నీ ఇబ్బంది పెడుతూ... ఈ టెన్షన్..." చందన మునివేళ్ళతో నుదుటి మీద రుద్దుకొంటూ, మాటలు రానట్టు ఆగి ఆగి అంది.

"డోంట్ బీ సిల్లీ చందూ. బాగా అలసిపోయినట్లున్నావు. ఈ వేళకి రెస్ట్ తీసుకో రేపట్నించీ చదువుకొందువులే." సురేష్ అనునయిస్తున్నట్లు అన్నాడు.

ప్రస్తుతానికి అంతకన్న చేసేదేమీ లేదని, ఇలాంటి మరోరోజు భానోదయం కోసం నిద్రకుపక్రమించింది అలసిన చందన.

• • •

"ఆ, ఓపెన్ యూనివర్సిటీలో చదవడం కూడా ఓ గొప్పనేమిటి? పనీపాటా పక్కన పెట్టి, ఇంట్లో కూర్చుని చదువుకుంటే ఎవరికైనా వస్తాయి గోల్డు మెడల్సు" ఆడపడుచు పెదవి విరుపు.

"ఇరవై నాలుగ్గంటలూ మీకు అన్నీ సమకూర్చి పెడుతున్నా, ఎప్పుడూ ఫస్ట్ ర్యాంక్ వచ్చిన పాపాన పోలేదు. మీ చందనాంటీ చూడండిరా, ఇంట్లో కూర్చుని చదువుకొని రేపు గవర్నరుతో గోల్డు మెడలు తీసుకుంటోంది. చూసి నేర్చుకోండిరా, కష్టపడడం ఎలాగో. ఫలితం అందుకోవడం ఎలాగో," ఆడపడచు వాళ్ళాయన సలహా, వాళ్ళ పిల్లలకే.

"అమ్మగార్ని రేపు టి.విలో చూపిస్తారట," రత్తాలు ఉత్సాహం.

ఇవన్నీ గుర్తొచ్చి నవ్వుకొంటోన్న చందన చేతిలో సురేష్ ఓ కవర్ పెట్టాడు.

కవర్ తెరిచిన చందన ఆశ్చర్యం, ఆనందంగా మారడానికి ఎక్కువ సమయం పట్లేదు. చందన చిరునవ్వు ఆ అభినందన పత్రానికి అంగీకారం చూపినట్లనిపించింది.

నిజానికి ` సురేష్ అభినందన పత్రం, అసాధారణ విజయం ఆమెలో నింపిన, ఆత్మ విశ్వాసానికి మరో ఛాలెంజ్!

కవరులో వున్నది పి.జి. అప్లికేషన్ ఫాం! ❊